క్లుప్తంగా

శ్రీవారి సేవలో డీఐజీ



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

సదర్‌ల్యాండ్‌లో ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు సదర్ ల్యాండ్ కంపెనీలో ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.మోహిద్దీన్ భాషా గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం ఇన్ఫోసిస్ కంపెనీలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి నిర్వహించిన ఉద్యోగమేళాలో విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.3 లక్షల ప్యాకేజీ ఉందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో సత్యం ఇన్ఫోసిస్ ప్రతినిధులు హేమంత్, సునీల్, వైస్ ప్రిన్సిపల్ సురేంద్ర, జేకేసీ సమన్వయకర్త రమేష్‌కుమార్, అకడమిక్ సమన్వయకర్త ఈశ్వర్‌బాబు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



మహిళలకు గ్యాస్ స్టవ్‌లు అందజేస్తున్న కమిషనర్ హరిత, బీజేపీ నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: క్షేత్రస్థాయిలో ప్రజలక జీవన భృతికి ఎలాంటి సదుపాయాలు కల్పించాలన్న సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తి దేశ ప్రధాని నరేంద్ర మోదీ అని బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప అన్నారు. తిరుపతి మున్సిపల్ 8వ సచివాలయ ఆవరణలో జరిగిన వికసిత భారత సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా ఉజ్వల స్కీమ్ కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లను కమిషనర్ హరిత చేతుల మీదుగా మహిళలకు పంపిణీ చేశారు. నోడల్ ఆఫీసర్ రవి కుమార్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సాయిబాబా మందిరం కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: శ్రీద్వారకామాయి శ్రీషిరిడీ సాయిబాబా సేవా సమాజ్ ఆధ్వర్యంలో గురువారం సాయిమందిరంలో నూతన ఏడాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయిబాబా మందిరం కమిటీ గౌరవాధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, కార్పొరేటర్ కె.సుబ్రమణ్యం, రవి, టి.బాలకృష్ణ, దుర్గం శ్రీనివాసులు, కళావతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో అభిరామి పీఠాధిపతి



పూజల్లో పాల్గొన్న సురేష్ గురుకుల్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం తమిళనాడు రాష్ట్రం తిరుకడైయూర్ అభిరామి పీఠాధిపతి సురేష్ గురుకుల్ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయనకు స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

టైలరింగ్‌తో స్వయం ఉపాధి

ఏర్పేడు: మహిళలు టైలరింగ్‌తో కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవచ్చని జనశిక్షణ సంస్థ ప్రోగ్రాం అధికారి హరిబాబు అన్నారు. గురువారం పాపానాయుడుపేట రాస్ మహిళా భారతి కార్యాలయంలో పెన్నగడం, పెనుమల్లం గ్రామాల మహిళలకు టైలరింగ్ శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ మూడు నెలలు ఉంటుందన్నారు.

నవీన తిరుపతి ఆవిష్కరణే లక్ష్యం





తిరుపతి అభివృద్ధి గురించి ప్రసంగిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణకారరెడ్డి, సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు

- నగర అభివృద్ధే లక్ష్యంగా 17 అంశాలకు కౌన్సిల్ ఆమోదముద్ర
- రూ.346.56 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం
- అందరి అజెండా అభివృద్ధే కావాలి: ఎమ్మెల్యే భూమన
- అభివృద్ధి పనులకు అగ్రతాంబూలం : మేయర్ శిరీష
- తిరుపతి దశ, దిశను మార్చడమే లక్ష్యం : డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: నవీన తిరుపతి ఆవిష్కరణే అందరి లక్ష్యంగా ముందుకు సాగాలని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆకాంక్షించారు. ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్లో గురువారం మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్, కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. నగర మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన నిర్వహించిన ఈ కౌన్సిల్ సమావేశానికి టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిషనర్ హరిత అజెండాలను కౌన్సిల్ ముందు ఉంచారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, భూమన అభినయరెడ్డితో పాటు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మేనేజర్ చిట్టిబాబు బడ్జెట్ వివరాలను కౌన్సిల్ ముందు ఉంచారు. రాబడి, మూలధన రాబడి, రెవెన్యూ, మూలధన ఖర్చులు, హౌసింగ్ రుణం చెల్లింపు వంటి వివరాలతో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. మొత్తం రూ.346.56 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే 2023–24 సవరించిన బడ్జెట్ అంచనాలకు కౌన్సిల్ ఆమోద ముద్రవేసింది. అలాగే నగర అభివృద్ధే లక్ష్యంగా 17 అంశాల అజెండాను సెక్రటరీ రాధిక కౌన్సిల్‌కు చదివి వినిపించారు. ఒక్కో అంశానికి సంబంధించి వివరణ ఇస్తూ కౌన్సిల్ 17 అంశాలకు సంబంధించి ఏకగ్రీవ ఆమోదాన్ని తెలిపింది.

అభివృద్ధే ఏకైక లక్ష్యం..

గతంలో ఎప్పుడూ చూడని అభివృద్ధిని నగర ప్రజలు ప్రస్తుతం చూస్తున్నారని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అన్నారు. అభివృద్ధే ఏకైక లక్ష్యంగా కౌన్సిల్ ముందుకు సాగడం నగరానికి పెద్దవరంగా మారిందన్నారు. నాలుగన్నరేళ్లలోనే తిరుపతి ఎంతో అభివృద్ధి చెందగా, కౌన్సిల్ వచ్చాక అభివృద్ధి మరింత వేగంగా పరుగులు పెడుతోందన్నారు. భవిష్యత్‌లో తిరుపతిని మరింత ఉన్నత నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

అభివృద్ధికి అగ్రతాంబూలం

తమ కౌన్సిల్‌లో తీసుకునే ప్రతి నిర్ణయం నగర అభివృద్ధితో ముడిపడి ఉండడం సంతోషంగా ఉందని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. మౌలిక వసతులు కల్పన, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌కు తాము అగ్రతాంబూలం వేశామన్నారు. నగరంలో విస్తారంగా రోడ్లు, మురుగు కాలువలు, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నట్లు ఆమె చెప్పారు.

చరిత్ర చెప్పుకునేలా అభివృద్ధి

తమ పాలనలో తిరుపతిలో జరిగిన అభివృద్ధిని చరిత్ర గుర్తు చేసుకుంటుందని డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి తెలిపారు. ప్రజలు తమకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, మౌలిక వసతుల కల్పనకు, నగర అభివృద్ధి కోసమే పాటుపడుతున్నామని తెలిపారు. ఎలాంటి స్వప్రయోజనాలకు తావు లేకుండా తిరుపతి దశ, దిశను మార్చడమే లక్ష్యంగా ప్రణాళికలు రచించామన్నారు. రోడ్ల అభివృద్ధి చారిత్రాత్మకమన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లతో నగరాన్ని కనెక్టివిటీ పెరగడం నగరంపై ఒత్తిడి తగ్గడంతో పాటు మరో ఐదు వేల ఎకరాల్లో తిరుపతి విస్తరించేందుకు అడుగులు పడ్డాయన్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు నగరంలో ఇంటర్నల్, కనెక్టివిటీ, రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు కూడళ్ల విస్తరణ చేశామన్నారు.

మైక్ సెట్లు వితరణ



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అడుగడుగునా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. గురువారం ఆయన ఎర్రావారిపాళెం మండల పర్యటనలో భాగంగా బోదేవాండ్ల పల్లెలో గురువారం ఆలయాలకు మైక్ సెట్లు అందజేశారు. - భాకరాపేట

రేపటి నుంచి తుడా చైర్మన్ పర్యటన

భాకరాపేట: ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరు అవుతున్నట్లు చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి తెలిపారు. గురువారం చిన్నగొట్టిగల్లు స్త్రీ శక్తి భవనంలో మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు మండలంలో 16వ తేదీ నుంచి 18 వరకు మూడు రోజుల పాటు కార్యక్రమం జరుగుతుందన్నారు. 16న శనివారం దేవరకొండ, చిట్టేచెర్ల, దీన్‌దార్లపల్లె, భాకరాపేట, 17న ఆదివారం ఎగవూరు, దిగవూరు, చట్టేవారిపాళెం, నెల్లుట్లవారిపల్లె, 18న సోమవారం తిప్పిరెడ్డిగారిపల్లె, జంగావాండ్లపల్లె, కోటబైలు, రంగన్నగారిగడ్డ, చిన్నగొట్టిగల్లు సచివాలయాల పరిధిలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేంద్రబాబు, ఈఓపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీఎం కుమార్, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసురక్షను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష

చంద్రగిరి: రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు సురక్ష పథకాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శిరీష సూచించారు. గురువారం మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి, కొటాల, మామండూరు, రంగంపేట గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని భూములను సర్వే చేసి విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఆయా రైతులకు పట్టాలను అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం మరో నాలుగు గ్రామాల్లో ఈ సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఆమె తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను సర్వే అధికారులకు చూపించాలని, తద్వారా సర్వే పూర్తి చేసి హద్దులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి రైతు ఖాతాకు ఏపీఎం నంబరును కేటాయిస్తామన్నారు. సర్వే చేసిన తర్వాత వాటిని డిజిటలైజేషన్ చేయడం ద్వారా భవిష్యత్తులో ఎటువంటి అవకతవకలకు తావుండదని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డీటీ అమృత, సర్వేయర్ పురుషోత్తం ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

19న చలో నెల్లూరు పోస్టర్ల ఆవిష్కరణ



ఛలో నెల్లూరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జైహో, జైభారత్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: జాతీయోద్యమ స్ఫూర్తితో జాతిని ఏకం చేస్తూ మతోన్మాదులను నిర్మూలించేందుకు జాతీయ స్థాయిలో నిర్మాణమవుతున్న మహోద్యమంలో భాగంగా నిర్వహించనున్న 2వ జాతీయ సమ్మేళనంలో భాగంగా ఈనెల 19వ తేదీ నిర్వహించే చలో నెల్లూరును జయప్రదం చేయాలని జైహో జాతీయ అధ్యక్షుడు విజయ శంకరస్వామి పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం గాంధీ విగ్రహం వద్ద జై భారత్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన చలో నెల్లూరు కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు సమీపాన పెన్నానది తీరాన పల్లిపాడు గ్రామంలో 102 ఏళ్ల క్రితం మహాత్మాగాంధీ స్వహస్తాలతో ప్రారంభమైన పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో అస్ఫాక్–బిస్మిల్ అమరత్వ దినమైన ఈనెల 19వ తేదీన దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల నుంచి విచ్చేస్తున్న ప్రతినిధులతో జైహో 2వ జాతీయ సమ్మేళనం జరుగుతుందన్నారు. ఈ సమ్మేళానానికి ప్రజలంతా పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఖాదిజ్ఞాసి షాజహాన్ మాట్లాడుతూ అష్ఫాక్, బిస్మిల్, వివేకానంద, గాంధీజీ, గఫార్‌ఖాన్, ఉద్ధం సింగ్‌ల స్ఫూర్తితో హిందూ ముస్లిం ఐక్యత స్థాపిస్తాం, మతోన్మాదులను దేశం నుంచి తరిమేద్దాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జైభారత్ సంస్థ జాతీయ అధ్యక్షుడు లోకనాథం, జాతీయ ఉపాధ్యక్షుడు వంశీ, షాహి అమిద్, జై భారత్, జైహో కార్యకర్తలు శ్యాంసుందర్, రజిని, మహేష్, నారాయణ పాల్గొన్నారు.

17 నుంచి ప్రత్యేక స్కై అబ్జర్వేషన్



మాట్లాడుతున్న శ్రీనివాస నెహ్రూ

తిరుపతి (అలిపిరి): ఈనెల 17 నుంచి తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో పిల్లలు, సందర్శకుల ప్రయోజనార్థం రోజూ సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ప్రత్యేక స్కై అబ్జర్వేషన్ నిర్వహిస్తున్నామని కేంద్రం ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ భూమి సూర్యుడి చుట్టూ మరో భ్రమణాన్ని పూర్తి చేయబోతోందని, నూతన సంవత్సరం 2024 ప్రారంభానికి గుర్తుగా అనేక ఖగోళ సంబంధమైన గ్రహాలు అందరినీ ఆకర్షిస్తాయన్నారు. వీక్షకులు, ఔత్సాహిక ఖగోళ శాస్త్రవేత్తలు, ముఖ్యంగా పాఠశాల పిల్లలు టెలిస్కోప్‌తో వీటిని వీక్షించడానికి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం అవకాశం కల్పిస్తోందన్నారు. ఈ ఖగోళ సంబంధమైన గ్రహాలు ఒకదాని వెనుక ఒకటి వరుసలో ఉంటాయని, సమయానుకూలంగా నెమ్మదిగా పశ్చిమం వైపునకు ప్రయాణిస్తాయని, వీటిని వీక్షించడానికి, రాత్రిపూట ఆకాశాన్ని ఆస్వాదించడానికి కేంద్రం ప్రత్యేక టెలిస్కోప్‌లు, బైనాక్యులర్లను అమర్చిందని తెలిపారు. ఆసక్తిగల సందర్శకులు సాయంత్రం 6 గంటలలోపు కేంద్రానికి చేరుకుని రూ.10 టికెట్ కొనుగోలు చేయవచ్చన్నారు.

గిరిజనులు సంఘటితం కావాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వడిత్యా శంకర్‌నాయక్, గిరిజన సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది గిరిజనులు సంఘటితమై ఐక్యం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ గిరిజనులకు పిలుపునిచ్చారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గిరిజనుల శంఖారావం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కుల సాధనకై గిరిజనులు మరింత చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఐకమత్యంతోనే గిరిజనులు మరింత అభివృద్ధి చెందుతారని, 2024 జనవరి 7వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే గిరిజనుల శంఖారావం సభకు గిరిజనులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేసి ఆత్మగౌరవాన్ని చాటాలన్నారు. కార్యక్రమంలో గిరిజన మహిళా రాష్ట్ర నాయకురాలు నాగమణి, ఎం.తేజనాయక్, ఎండీ.మంజుకుమార్ నాయక్, ఎం.నీలేనాయక్, ఈశ్వర్ నాయక్, చెన్నమ్మ నాయక్, ఎం.బాపూజీ నాయక్, గిరిధర్, శ్యామలమ్మ బాలాజీ నాయక్, సైరాజ్ నాయక్, రాజశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో వేదస్వస్తి చతుర్వేద పారాయణం



మాట్లాడుతున్న జేఈఓ సదాభార్గవి

తిరుపతి(అలిపిరి): ధర్మప్రచారంలో భాగంగా నాలుగు వేదాల సారాన్ని ప్రజలకు తెలియజేసేందుకు 2024 ఫిబ్రవరి మొదటి వారంలో సహస్రపురుష వేదస్వస్తి చతుర్వేద పారాయణం నిర్వహిస్తామని, ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ జేఈఓ సదాభార్గవి అధికారులను ఆదేశించారు. దీనిపై తిరుపతిలోని పరిపాలన భవనంలో గురువారం అధికారులతో జేఈఓ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోకక్షేమం కోసం ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాలు, ఆరోగ్యం, అభ్యుదయం కలగాలని ఆకాంక్షిస్తూ ఈ పారాయణ కార్యక్రమం నిర్వహిస్తామని, ఇందుకోసం టీటీడీ పరిపాలనా భవనం మైదానంలో ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ పండితులను ఆహ్వానించాలన్నారు. శ్రీ వేంకటేశ్వర ఉన్నత వేదాధ్యయన సంస్థ ఆధ్వర్యంలోని స్కీమ్ పారాయణదారులను సైతం భాగస్వాములను చేయాలని కోరారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించి ఆయా విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్వీ వేదవర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ రాధేశ్యామ్, సీఏఓ శేషశైలేంద్ర, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, హెచ్‌డీపీపీ కార్యదర్శి సోమయాజులు, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి డా.ఆకెళ్ల విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బస్సులోనే క్లీనర్ మృతి

అన్నానగర్: అంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతికి చెందిన దాదాపు 35 మంది అయ్యప్ప భక్తులు మినీ బస్సులో శబరిమలకు వెళ్లి తిరువనంతపురం మీదుగా తిరిగి ఇంటికి వస్తున్నారు. వీరు గురువారం ఉదయం కన్యాకుమారి–నెల్‌లైనాలుగు లైన్ల రహదారిపై మినీ బస్సులో వస్తున్నారు. పనంగుడి సమీపంలోని నాలుగు లైన్ల రోడ్డులో వెళుతున్న సమయంలో క్లీనర్ తిరుపతికి చెందిన కృష్ణ (52)కు ఛాతీనొప్పి వచ్చింది. బస్సు ప్రయాణికులు వెంటనే కృష్ణను పనంగుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తేలింది. అనంతరం పనంగుడి పోలీసులు కృష్ణన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆచారిపాళెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎంపీపీ దొరస్వామినాయుడికి నివాళి



నివాళులర్పిస్తున్న హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని వెంకట్రామాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఆరి దొరస్వామి నాయుడు గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని దొరస్వామినాయుడు పార్థివదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు భానుకుమార్‌రెడ్డి, భాస్కర్, గిరిధర్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో 1976–78 మధ్య ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు గురువారం కళాశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీటీడీ విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న విద్యాసంస్థల అభివృద్ధికి తమవంతు సాయం అందిస్తుండడం అభినందనీయమన్నారు. అలాగే ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రతి గ్రూపులో ప్రతిభ చాటిన ప్రోత్సాహించడం గొప్ప విషయమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు రూ.1 లక్ష విలువైన సీసీ కెమెరాలు, మానిటర్, డీవీఆర్‌లను కళాశాలకు విరాళం అందించగా, అధ్యాపకులు తమవంతుగా 10 సీసీ కెమెరాలను విరాళంగా అందించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సామగ్రిని అందజేస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదిగి కటుంబాలకు బాసటగా నిలవాలని హోటల్ భీమాస్ రెసిడెన్సీ చైర్మన్ బాలాజీ, నవ భారత్ సేవాసమాజ్ సంస్థ ప్రధాన కార్యదర్శి రహంతుల్లా షరీఫ్ పిలుపునిచ్చారు. గురువారం వారు భారత్ సేవాసమాజ్ ఆధ్వర్యంలో తిమ్మినాయుడు పాళెంలో మహిళలకు ఉచిత టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ ఉపాధి శిక్షణ ద్వారా మహిళలు నైపుణ్యాలను మెరుగు పరుచుకుని స్వయం ఉపాధిలో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో జన్‌శిక్షణ సంస్థాన్ శాఖ అధికారి సుధాకర్, నవభారత్ సేవాసమాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

భగవంతునికి చేరువ చేసేవే ఆగమాలు



మాట్లాడుతున్న ఆచార్య వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్యులు

తిరుపతి సిటీ: భగవంతునికి చేరువ చేసేవే ఆగమాలని ఆగమ గ్రంథాల్లో అనేక తాత్విక అంశాలు నిగూఢంగా ఉన్నాయని, వాటిని అధ్యయనం చేయడం నేటిసమాజానికి ఎంతో అవసరమని ఆచార్య వేదాంతం శ్రీవిష్ణు భట్టాచార్యులు అన్నారు. గురువారం తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో 15 రోజులపాటు ఆన్‌లైన్ ద్వారా జరిగే విమానార్చనాకల్పంపై వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహర్షుల వాఙ్మయం అత్యంత విశిష్టమైనది అని, భారతీయ సంస్కృతికి ఆధారాలు ఆగమాలే అన్నారు. ఇందులో భాగంగా 50 మందికి పైగా తమ వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో యకడమిక్ డీన్ ప్రొఫెసర్ తట్టా విజయరాఘవాచార్యులు, సహాయాచార్యులు పి.టి.జి. రంగరామానుజాచార్యులు, అతిథి అధ్యాపకులు డా.సీహెచ్ పవన్ వంశీ, ఫైనాన్స్ ఆఫీసర్ చక్రవర్తి రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలవాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి అర్బన్: మిచాంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన వరద బాధితులకు అండగా ఉండాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. ఆయన నేతృత్వంలో గురువారం తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మిచాంగ్ తుపాన్‌తో తిరుపతి జిల్లాకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రంలో 18 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం నిశితంగా పరిశీలించి, రాష్ట్రానికి తూతూ మంత్రంగా కాకుండా పెద్దమొత్తంలో సాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జరిగిన నష్టంతో పేదలు పెద్దఎత్తున ఇబ్బంలు పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో వ్యక్తికి రూ.1000, కుటుంబానికి రూ.2500, నిత్యావసర సరుకులు అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, గురవయ్య, నదియా, తిరుపతి నగర కార్యదర్శి విశ్వనాథ్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.